# స్వార్థం కోసం నిండు జీవితంతో ఆడుకున్న అతడు మనిషేనా?

## పెనుమాక నాగేశ్వరరావు కథ

# సంకుచితం

రోజూ కాలేజీకి వెళ్ళగానే లెటర్ బాక్స్ చూడటం అలవాటు సురేష్‌కు. తరచుగా తండ్రి దగ్గర్నుంచే వస్తుంటయ్ ఉత్తరాలు. రోజూ అలవాటుగా ఉత్తరాలకోసం చూస్తున్నా డబ్బు అవసరం వున్నప్పుడు మాత్రం ఆత్రంగా, ఆశగా, ఆందోళనగా చూస్తాడు లెటర్స్‌కోసం.

నాలుగు రోజుల క్రితమే బ్యాంక్ డ్రాఫ్టులోపాటు ఉత్తరం కూడా వచ్చింది తండ్రి దగ్గర్నుంచి. అంతలోనే మరో ఉత్తరం రావడంకొంచెం ఆశ్చర్యాన్ని, ఆసక్తిని కలిగించిందతనికి.

క్లాసు రూము వైపునడుస్తూనే ఉత్తరం తెరచి చదవనారంభించిన సురేష్ నడక ఆగిపోయింది ఒక్కసారిగా.

తనకి పెళ్ళి చేయటానికి నిర్ణయించుకున్నట్లు, సంబంధం కూడా చూసినట్లు, తనని వెంటనే బయల్దేరి రావలసిందిగా తండ్రి వ్రాసిన ఉత్తరం సురేష్‌ను అయోమయంలో పడవేసింది.

ప్రతి ఉత్తరంలోనూ శ్రద్ధగా చదువుకోమని, చదువు తర్వాతనే మిగిలిన విషయాల మీద దృష్టి పెట్టుకోమని హితబోధలు చేస్తూ ఉత్తరాలు వ్రాసే తండ్రి హఠాత్తుగా ఈ నిర్ణయానికి రావడం ఎందుకు జరిగిందో ఎంత ఆలోచించినా అర్థంకాలేదు, అంతుపట్టలేదు.

క్లాసుకు వెళ్ళాలనిపించలేదు సురేష్‌కు. మనసంతా రకరకాల అనుమానాలతో, ఆలోచనలతో అస్తవ్యస్తంగా తయారయింది. ఏమీ తేల్చుకోలేని సందిగ్ధ స్థితిలో అన్యమనస్కంగా రూముకి చేరుకున్నాడు.



"ఈ కష్టాలన్నీ పడేకంటే మన సురేష్‌కుకూడా పెళ్ళి చేసేస్తే సరిపోతుంది. ఆ వచ్చే కట్నం డబ్బుల్తో వున్న అప్పులు తీర్చేస్తే నిశ్చింతగా వుండొచ్చు. ఉద్యోగం లేకపోతే మాత్రం ఏం! పిల్లనిచ్చే వాళ్ళువుండక పోతారా" ఎప్పుడో ఒకటి రెండుసార్లు తన తల్లితో నాన్న అన్న మాటలు గుర్తుకు వచ్చినై సురేష్‌కు.

క్షణికమైన ఆవేశంలో, ఆర్థిక ఇబ్బందుల ను తట్టుకోలేక యధాలాపంగా అన్న మాట లేగానీ తండ్రి అంతరంగంలో నుంచి వచ్చిన మాటలు కాదని సురేష్‌కు బాగా తెలుసు.

'డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతు న్న నాకు అప్పుడే పెళ్ళా! నా చదువుకు కావలసిన డబ్బుని పంపటానికి నానాకష్టాలు పడుతున్న నాన్నకు అదనపు భారంగా మరో మనిషి రావటమా. అయినా నా పెళ్ళికి తొందర ఏమిటి?'

ఉద్యోగం, సద్యోగం లేని నాకు పిల్లనెవరి స్తారు. వరకట్నాల్తో విసిగివేసారుతున్నవారు ఎవరయినా పిల్లకు పెళ్ళి చేయటమే పరమా వధిగా పెట్టుకున్న వాళ్ళు ఎవరయినా పిల్లనిచ్చేందుకు సిద్ధపడినా, పెళ్ళిచేసుకుని పెళ్ళాన్ని ఎలా పోషించడం, అసలు అప్పుడే పెళ్ళెందుకు చేసుకోవాలి?' మనసులోనే తర్జన భర్జన పడ్డాడు సురేష్.

'పెళ్ళి చేసుకుంటే వుద్యోగం వెతుక్కోక తప్పదు, సంసారం, వుద్యోగం మధ్య చదువుకోవడం ఎంతవరకు సాధ్యం? ఏమిటీ వైపరీత్యం' ప్రశ్నల పరంపరతో నిండిపోయింది సురేష్ మనసు.

అర్థాంతరంగా తండ్రి ఎందుకిలాంటి నిర్ణయానికి వచ్చాడో అంతుపట్టక ఆలోచనల్లో సతమతమైపోయిన సురేష్ మనసులో మెరుపులా మెరిసిందొక అనుమానం.

'కొంపతీసి మొన్నామధ్య మామయ్య నా రూముకి వచ్చినప్పుడు కమల నా రూములో వుండటం చూసి, లేనిపోని వూహాగానాలు చేసి, ఆయనగారు అమ్మ నాన్నలను భయపెట్టలేదుకదా' ఈ ఆలోచన రాగానే కలవరపడ్డాడు సురేష్.

హఠాత్తుగా తండ్రి ఈ నిర్ణయానికి రావటం తన మామయ్య చలవే అని నిర్ధారించుకున్నాడు.

కమల సురేష్ అద్దెకు వుంటున్న ఇంటి వాళ్ళ అమ్మాయి. ఇద్దరూ క్లాస్‌మేట్స్. వారం రోజుల్నుంచి కాలేజీకి రాని కమల నోట్సు అడిగి తీసుకువెళ్ళటానికి సురేష్ రూముకి వచ్చింది. కాలేజీ కబుర్లు చెప్పుకుంటూ కాసేపు కూర్చున్నారిద్దరూ. సరిగ్గా ఆ సమయంలోనే సురేష్ మామయ్య ఊర్నుంచి వచ్చాడు. ఆయన వచ్చీరాగానే తనవంక, కమలవంక అదో రకంగా, అనుమానంగా చూడటం ఆయన రాగానే కమల వెళ్ళిపోవడం జరిగింది.

తల్లిదండ్రుల క్షేమసమాచారాలు గానీ, ఆయన వచ్చిన పని గురించి కానీ ఏమీ చెప్పకుండా ఏకంగా కమలని గురించిన వివరాలు, ఆ అమ్మాయి తన రూముకి వచ్చిన కారణం అన్నీ ఆరా తీసినట్లు అడిగాడాయన.

''ఇలా కబుర్లూ, కాలక్షేపాలేనా, కాలేజీకి వెళ్ళటం, చదువుకోవటం ఏమైనా వుందా'' కోపంగా ఆయన అడగటం కూడా గుర్తువచ్చింది సురేష్‌కు.

తన అనుమానం బలపడింది. మేనమామ చేసిన నిర్వాకమే ఇదంతా అనుకున్నాడు సురేష్.

'వెంటనే బయల్దేరి వూరు వెళ్ళకపోతే, కేవలం కమల కోసమే వుండి పోయానని, ప్రేమ కలాపాల్లో మునిగిపోయానని, ఇంట్లో వాళ్ళమాట కాదనే స్థితికి ఎదిగిపోయానని, చదువుకోకుండా చెడిపోతున్నానని తన ఇష్టం

వచ్చినట్లు వాగేస్తాడు మామయ్య. అవన్నీ నిజాలేనని భ్రమపడతారు అమ్మ, నాన్న. అందుకే ఏదిఎలా జరిగినా ముందు వూరు వెళ్ళాలి' అనుకున్న సురేష్ వెంటనే సూట్ కేస్ సర్దుకుని రూముకి తాళంవేసి బస్టాండుకు బయల్దేరాడు.

ఇల్లంతా ప్రశాంతంగా వుంది. వరండాలో వాలుకుర్చీలో కూర్చుని భారతం చదువుకుంటున్నాడు తండ్రి. పక్కనే బియ్యం బాగుచేసుకుంటూ కూర్చుంది తల్లి.

కొడుకుని చూడగానే ముసిముసిగా నవ్వుకున్నారిద్దరూ. 'పెళ్ళనగానే పరుగెత్తుకుంటూ వచ్చాడు చూశారా' అన్న అర్థం స్ఫురించింది వాళ్ల నవ్వులో సురేష్‌కు. చిరుకోపం ప్రదర్శిస్తూ మౌనంగా లోపలికి నడిచాడు.

''నాన్నగారి ఉత్తరం చేరిందాబాబు'' అడిగింది తల్లి. ''ఆ... ఆ... అందుకేగా వచ్చింది'' నిష్ఠూరంగా చెప్పేడు.

''ఏంటమ్మా ఇది. ఇప్పుడే నాకు పెళ్ళేమిటి. హఠాత్తుగా ఈ నిర్ణయం ఏమిటి' కోపంగా అడిగేడు.


''నాకేం తెలియదు నాయనా. నేను చెప్తే వింటారా! నా మాటకు ఈ ఇంట్లో ఎంత విలువుందో నీకు తెలియందేముంది. అంతా మీ నాన్నగారి ఆలోచనే. ఆయన ఇష్టమే— ఆయన్నే అడుగు'' తన కసినంతా వెళ్ళగక్కిందామె.

''ఆ... ఆ... ఇక చాల్లే ఆపు నీ నిష్ఠూరాలు'' అంటూ హాల్లోకి వచ్చాడు సురేష్ తండ్రి.

''సురేష్ నువ్విలా రా అంతా వివరంగా చెపుతాను'' అంటూ పెరట్లోకి నడిచాడాయన.

మౌనంగా ఆయన్ననుసరించాడు సురేష్.

''నేనిన్ను చదివించాలని. చదువు పూర్తయ్యాక వుద్యోగ ప్రయత్నంచేయాలని అనుకుంటున్నానే కాని ఇప్పుడే పెళ్ళిచేసి నిన్ను పెద్దవాడ్ని చేయాలనుకోలేదురా. కాని మొ



స్న మీ బావ వచ్చి వాళ్ళ బంధువులమ్మాయి పెళ్ళిదుకు వచ్చివుందని, వాళ్ల తరవు ముసలావిడ కోరిక మేరకు ఆమె ప్రాణంతో వుండగానే మనవరాలి పెళ్ళి చేయాలని పట్టుపట్టటంతో పెళ్ళికి తొందర పడుతున్నారని చెప్పేడు.

మంచి సంబంధం మన సురేష్‌కు ఇచ్చి చేస్తే బాగుంటుందని చెప్పేడు. ముసలావిడ కోరిక తీర్చడానికి పెళ్ళయితే చేస్తారటగాని మనకి అభ్యంతరం లేకపోతే నీ చదువు పూర్తయ్యే వరకు అమ్మాయిని వారింట్లోనే వుంచుకుంటారట''

''నీకు డిగ్రీ పూర్తికాగానే ఉద్యోగం ఇప్పించుకో గలిగే పలుకుబడి కూడా వుందట పిల్ల తండ్రికి. అన్నిరకాలుగానూ మనకి తగిన సంబంధమని, పిల్ల అందంగా వుంటుందని, రకరకాలుగా నాకు నచ్చజెప్పి నీకు ఉత్తరం వ్రాసే వరకు నన్ను నిలవనీయలేదు బావ. అతని మాట కాదనలేక కొంత, మంచి సంబంధం అంటున్నాడు కదా అని కొంత నేనూ పరిపెట్టుకుని, మనసుని సమాధానపరుచుకుని పెళ్ళిచేసెయ్యాలని నిర్ణయించుకుని నీకు వ్రాశాను. ఓసారి నీవు కూడా బావని కలిసి మాట్లాడిరా'' చెప్పేడాయన.

బయల్దేరేటప్పుడు పెళ్ళంటే వున్న విముఖత, విసుగు కొంత వరకు తగ్గినయ్ సురేష్‌లో. అసలిప్పుడే పెళ్ళి వద్దనుకున్న తను చేసుకోటమా లేదా అన్న సందిగ్ధంలో పడ్డాడు.

ఆలోచిస్తూనే అక్కయ్యగారింటికి వెళ్ళాడు సురేష్.

ఏది ఏమయినా ఈ హఠాత్పరిణామానికి కారణం మామయ్య కాదని, కమల ప్రమేయం అసలే లేదని తెలిసిన తర్వాత సురేష్ మనసుకు కొంత వూరట కలిగిన మాట వాస్తవమే అయినా అప్పుడే పెళ్ళిచేసుకోవడం సమంచితంగా అనిపించలేదతనికి.

* * *

''హలో సురేష్... ఎంత సేపయింది వూర్నుంచి వచ్చి. కంగ్రాట్స్. పెళ్ళిచేసుకోబోతున్నావటగా'' నవ్వుతూ అన్నాడు సురేష్ బావ అనిల్‌కుమార్.

''వూరుకో బావా... అప్పుడే నాకు పెళ్ళేంటి. నేనిప్పుడే చేసుకోను'' చిరుకోపంగా అన్నాడు సురేష్.

''డోన్ట్ బిసిల్లీ మైడియర్ బాయ్... అసలు పెళ్ళిచేసుకోవాల్సిన వయసు ఏమిటో తెల్సా నీకు... సరిగ్గా ఇప్పుడు నీవయసదే. ఇప్పుడు చేసుకుంటే వుండే థ్రిల్, మాలాగా చేసుకుంటే వుండదు. అయినా అసలు నువ్వు అమ్మాయిని చూసి ఆటుతర్వాత మాట్లాడు'' అంటూ అతని భుజం తట్టాడు అనిల్.

''చదువు పూర్తికా...''

''ఆ... ఆ... ఆ విషయాలన్నీ నాకు వదిలెయ్. నువ్వు బుద్ధిగా డిగ్రీ పూర్తిచెయ్. సర్టిఫికెట్ సంపాయించిన మర్నాడు మీ మామగారు నీకు ఉద్యోగం ఇప్పిస్తారు... సరేనా''

''... ... ...''

''నా మాట కాదని ఈ పెళ్ళికి ఒప్పుకోకపోతే ఇలాంటి సంబంధం మళ్ళీ దొరకడం మాత్రం కష్టం. ఆ తర్వాత నీ

ఇష్టం''.

''ఏరా తమ్ముడూ ఎప్పుడొచ్చావ్'' వాకిట్లో నుంచే అడుగుతూ వచ్చింది వసంత— సురేష్ అక్క.

''ఓ గంట అయిందక్కా''

పెళ్ళి కూతురి గురించి, పట్టుచీరెల గురించి, పెళ్ళి ఫోటోల గురించి, ఒకటేమిటి పెళ్ళి సందడంతా మాటల్లో కనపరచింది వసంత వడివడిగా.

''మీ తమ్ముడికి ఇప్పుడే పెళ్ళిచేసుకోవటం ఇష్టంలేదట'' వ్యంగ్యంగా అన్నాడు అనిల్ కుమార్.

''చాల్లే వూరుకోండి... అయినా వాడు మీ అందరి మాట కాదన్నా, నా మాట మాత్రం కాదనడు కదరా సురేష్'' అంటూ తమ్ముడి దగ్గరగా వచ్చి అడిగింది.

''అది కాదక్కా...''

''నువ్వింకేమీ చెప్పొద్దు. రేపే పెళ్ళిచూపులు. అనుకున్నవన్నీ అనుకున్నట్లు జరిగిపోనీ'' ఆజ్ఞాపిస్తున్నట్లు అన్నదామె.

''నీ నిర్ణయం బాగానే వుంది కానీ... మన పరిస్థితులు కూడా ఆలోచించుకోవాలిగా సురేష్. మీ నాన్న ఆర్థిక ఇబ్బందుల్లో వున్నాడు. ఆయన కష్టాలు తీర్చినట్లూ వుంటుంది. నీకూ కొంత చేయూతగానూ వుంటుంది. పైగా వాళ్ళు కట్నం ఇచ్చుకోలేనంత తక్కువ స్థితిలో ఏమీ లేరు.

తనుగా ఏ నిర్ణయమూ తీసుకునే అవకాశం లేదని గ్రహించిన సురేష్ అనాలోచితంగానే పెళ్ళిచూపులకు వెళ్ళక తప్పలేదు

పెళ్ళి నిశ్చయం అయింది. పెళ్ళి పెద్ద సురేష్ బావ అనిల్ కుమార్. కట్నకానుకలు వగైరా విషయాలన్నీ అతనే మాట్లాడేడు. పెళ్ళి ఏర్పాట్లన్నీ అతనే చూసుకుంటున్నాడు. ముహూర్తాలు కొద్ది వ్యవధిలోనే కుదిరినై.

సురేష్ పెళ్ళి ఆర్భాటంగానే జరిగింది. ఎలాంటి అభిప్రాయభేదాల్లేకుండా పెళ్ళి తంతు ముగిసింది. బంధువులు కూడా ఎవరిదారిన వాళ్ళు వెళ్ళిపోయారు. పెళ్ళికూతురు పుట్టింట్లోనేవుంది. సురేష్ మళ్ళీ కాలేజీకి వెళ్ళేందుకు వూరు ప్రయాణం కావాలనుకుంటున్నాడు. క్రితం రోజే సురేష్ అక్కబావకూడా వెళ్ళిపోయారు. వెళ్ళే ముందు అనిల్ కుమార్ కట్నం డబ్బు, పెళ్ళి ఖర్చులు వగైరా వివరాలన్నీ మామగారికి చెప్పి వెళ్ళాడు. ఆ విషయంలో ఏమాత్రం ఆసక్తికనపరచలేదు సురేష్.



## ఎక్కువ

పాఠం చెప్పాక ప్రశ్నలడుగుతున్నారు సైన్స్ మాస్టారు.

''విటమిన్–సి ఎందులో ఎక్కువగా ఉంటుందో చెప్పరా గోపీ'' అడిగారు మాస్టారు.

''విటమిన్-సి టాబ్లెట్‌లలో సార్'' వెంటనే చెప్పేశాడు గోపి.

—చందం రాంమోహన్ (వరంగల్)

కు చెప్పి వెళ్ళాలనే వుద్దేశ్యంతో వాళ్ళ ఇంటికి వెళ్ళాడు సురేష్.

''మొత్తానికి అనుకున్నది సాధించావురా అనిల్''

''ఏమిటది... మా బామ్మర్దిగాడి పెళ్ళా' ' నిర్లక్ష్యంగా అన్నాడు అనిల్ కుమార్.

లోపల్నుంచి ఆ సంభాషణ వినపడటంతో అప్రయత్నంగా గుమ్మం దగ్గరే ఆగిపోయాడు సురేష్.

''అప్పుడే పెళ్ళివద్దని మొత్తుకుంటున్నా వాడికి మంత్రం వేసి ఒప్పించావ్. పాపం ఇక వాడి చదువేం సాగుతుంది'' వెటకారంగా అన్నాడు రెండో మనిషి.

వినిపిస్తున్న గ్లాసుల చప్పుడు, వారి మాటల ధోరణిలను బట్టి లోపలి వాతావరణం అర్ధం చేసుకున్న సురేష్ మరింత ఆసక్తిగా వారి మాటల్ని వింటూ అక్కడే నిలబడ్డాడు.

''అయినా అంత పకడ్బందీగా ప్లాను ఎలా తయారుచేశావో చెప్పు... వినాలని వుంది'' వుత్సాహంగా అడిగాడు.

''సింపుల్ మైడియర్ ఫ్రెండ్. కట్నం తాలూకు నాకు మా మామ బాకీ వున్న పదివేలు వెంటనే కావాలని పట్టుపట్టాను. వున్న పళంగా పదివేలు తెమ్మంటే నా వల్ల ఏమవుతుందంటూ బిక్కముఖంవేశాడా ముసలాడు. నీవల్ల కాకపోతే నేనో ప్లాను చెపుతాను వినంటూ కొడుకు పెళ్ళిచెయ్యమని సలహా ఇచ్చాను. ఆర్థిక ఇబ్బందుల్లో వున్న ముసలాడు కొడుకు పెళ్ళితో వచ్చే కట్నం డబ్బులు లెక్క చూసుకున్నాడు. కాదనలేకపోయాడు. కొడుక్కి ఈ విషయం కోడని హెచ్చరించాను. ఇకపోతే వాడి అక్క... అదే... నా భార్య. ఆమెకి ఆడబిడ్డ లాంఛనాలు, పట్టుచీరెలు వగైరా సెంటిమెంట్ల గురించి వూదరగొట్టేయగానే నమ్మేసి, మురిసిపోయింది. మా బామ్మర్ది వున్నాడు చూడు... వయసులోవున్న కుర్రకుంక పెళ్ళి చేస్తామని బలవంతం చేస్తే కాదంటాడా. దానికి తోడు ఆ పిల్ల... అదే కొత్త పెళ్ళికూతురు బంగారు బొమ్మలా వుంటుంది. ఆ అందం చూసి నోరువిప్పకుండా ఒప్పేసుకున్నాడు పాపం'' అంటూ వెకిలిగా నవ్వాడు అనిల్ కుమార్.

అనిల్ కుమార్ ఆంతర్యం గ్రహించిన సురేష్ స్థాణువులా నిల్చుండిపోయాడు. తన స్వార్ధం కోసం ఇంత నాటకం ఆడిన అతనంటే అసహ్యం వేసింది సురేష్‌కు. ఒక్క క్షణంకూడా అక్కడ వుండబుద్ధికాలేదు. అతని ముఖం చూడాలనిపించలేదు. అందుకే వెంటనే వెనుతిరిగి ఈ విషయం గురించి ఎవరితోనూ చర్చించకుండానే వూర్కుప్రయాణం అయ్యాడు సురేష్.

బావగారికి———

సురేష్ నమస్కరించి వ్రాయునది ఎంతో తాపత్రయపడి, మరెన్నో వ్యయప్రయాసలకు ఓర్చి, పెళ్ళిపెద్దగా బాధ్యతలను స్వీకరించి నా పెళ్ళి జరిపించినందుకు కృతజ్ఞతలు.

ఇంకా చదువు పూర్తికాకుండా, సంపాదన లేకుండా పెళ్ళిచేసుకుంటే నా భవిష్యత్తు ఎలా వుంటుందో ఓ స్నేహితుడిగా సాటి మగవాడిగా ఆలోచించలేకపోయారు. సంపాదన లేకుండా సంసారంలో పడి సతమతమై

పోవడం గురించి సహృదయంతో సావధానంగా ఆలోచించగలిగివుంటే మీ నిర్ణయం సముచితమైంది కాదని అనుకునేవారే.


మా అక్కను మీరు పెళ్ళిచేసుకుని దాదాపు పన్నెండు సంవత్సరాలయింది. మరో గత్యంతరం లేక మా నాన్నగారు మీకివ్వాల్సిన కట్నంలో తగ్గిన మొత్తాన్ని నాకు వచ్చే కట్నంలో నించి ఇస్తానని వాగ్దానం చేసిన మాట నిజమే. కాని ప్రస్తుతం మీకు డబ్బు అవసరం రావడంతో ఈ రకంగా ఆ అవసరం తీర్చుకోవడం నా దృష్టిలో అమానుషం.

అయినా ఇన్ని సంవత్సరాలు కలిసి కాపురం చేసి పిల్లల్ని కన్నాక కూడా కట్నం బాకీ అంటూ వసూలుచేసుకోవడం మీలాంటి వారికే సాధ్యం.

కేవలం మీ కట్నం బాకీ కోసమే నా పెళ్ళిచేయడం నాకు మీరు చేసిన అన్యాయంగా భావిస్తున్నాను. మీ అవసరం గురించి నిస్సంకోచంగా ఓమాట చెప్పివుంటే సంతోషంగా సర్దుబాటుచేసేవాడ్ని.

నా చదువు కొనసాగకపోయినా, తద్వారా నా భవిష్యత్తు చెడిపోయినా అందుకు బాధ్యులు మీరే.

ఈ మీ సంకుచితమైన ఆలోచనని, మీ అంతరంగాన్ని ఎవ్వరితోనూ చెప్పనులేండి. ఏది ఏమైనా మీరు చేసిన పని 'తప్పు' అని ఒప్పుకుంటే సంతోషిస్తాను.



## ఇదేం చదువు

కిండర్ గార్టెన్ చదువుతున్న సమయంలోనే పిల్లల్ని బృహస్పతుల్ని చేద్దామనే మన ప్రభుత్వ తపన బానే వుంది కానీ. ఈ పిచ్చి సిలబస్‌తో పిల్లల బుర్రలు పాడైపోయి బరువెక్కుతున్నాయన్నది నిజం! ఇలాటి పద్ధతులు విద్యకు ఉపయోగపడవని గ్రహించిన న్యూజిలాండ్ దేశం ఇకనుంచి 12 సంవత్సరాల వయసు నిండినవారే... క్లాసులో కూర్చుని టీచర్ లెక్చర్ వినాలని ఆదేశించింది.

అప్పటివరకూ అదొక క్లాస్ రూంలా గాక పిల్లలు ఇష్టం వచ్చిన చోట నేలమీద గుంపులుగా కూర్చుని ఉంటారు. టీచర్లు అటూ ఇటూ తిరుగుతూ... పిల్లలకు ఆడుతూ పాడుతూ పాఠాలు చెప్తారు! మన దేశ విద్యావేత్తలకు ఇలాంటి మంచి ఆలోచన ఎప్పటికి వస్తుందో కదా!

—జూపిటర్